# సంజీవయ్య ఉగాది సంబరం

"మంజుశ్రీ"

స్కెచ్

సంజీవయ్య కుర్చీలో చేరగిల బడ్డాడు ఉస్సురనుకుంటూ. లోపల్నుంచి వచ్చి "రేపు ఉగాది, తెల్సుగా" అంది శ్రీమతి.

"మా కుగాదులు లేవు, మా కుషస్సులు లేవు మాకు ఏమీ లేవు" అన్నాడు సంజీవయ్య.

"బాగుంది. సరేలెండి బజారుకెళ్ళి సరుకులు ఎప్పుడు తెస్తారు?"

"ఏం సరుకు? అన్నాడు సంజీవయ్య.

"పండగసరుకండీ! రేప్పండగ్గదండీ!" అంది శ్రీమతి.

"పన్నెండో తారీకు పండగ రావట మేంటి. నా మొహం. చక్కగా నాలుగైదు తారీకులలో వస్తే ఎంత బాగుండును" అన్నాడు సంజీవయ్య.

"మీ ఇష్ట మొచ్చినప్పుడొస్తుంది లెండి! తలంటు ఎప్పుడు పోయించుకుంటారు? రేప్రొద్దుట నేనూపిల్లలు రుద్దుకుంటాం, యీపూట మీకు రుద్దేస్తాను. ఏమంటారు?"

"నాకు తలంటు వద్దు" అన్నాడు సంజీవయ్య.

"రోజు రోజుకూ తలలేకుండా పోతున్నదేమండీ మీకు! ఉగాదికి తలంటు పోసుకోకుండా వుంటారా? ఏం ఖర్మ, తలంటుపోసుకోండి అంటుంటే ఏమి టేమిటో చెబుతారు."

"నాకు తలంటూ లేదు" అన్నాడు సంజీవయ్య.

"అట్లనే వుంది!" అంది శ్రీమతి చిన్నగా నవ్వుతూ.

సంజీవయ్య నిశ్చలత్వంలో వుండిపోయాడు తలంటి పోసుకుందామా? వద్దా? అని ఆలోచించుకుంటూ. చంటివాడు క్యారుమన్నాడు. శ్రీమతి లోపలికి వెళ్ళిపోయింది.

సంజీవయ్యకు చప్పున చిన్నప్పుడు చదువుకున్న పద్యం గుర్తొచ్చింది. "వికసిత ఘనసూనోద్వేల జాలప్రవాళ ప్రకట కపట రూఢప్రౌఢ కీర్తి ప్రతాప, ప్రకట జయసమంచత్పంచ బాణ స్తవుద్గా, యకశుకపిక కాంతంబై వసంతంబువచ్చెన్." ఆహా, ఎంత బాగా చెప్పాడయ్యా పింగళి సూరన్న గారు. అనుకున్నాడు సంజీవయ్య. వసంత ఋతువు వస్తున్నది. ఎన్ని వసంత ఋతువులు రాలేదు గనక! తన జీవితం యింతే, ఇప్పటికి ముప్పై వసంతాలు గడచిపోయినాయి. ఇంక ఎన్ని గడవనున్నవో! శ్రీమతి లోపల్నుంచి వచ్చింది. "ఏమండీ-వస్తారా తలంటుతాను. నీళ్ళు కాగుతున్నాయి చప్పున తేలిపోతుందిరాండి," అంది.

"ఇప్పుడు తలంటు పోసుకోకపోతే ఏంచెప్పు—ఇది మనకు పండక్కాదు." అన్నాడు సంజీవయ్య.

"ఛా! అదేమిటండీ, ఉగాదికి పండగ చేసుకోకపోతే ఇక సంవత్సరం మొత్తమంతే సంతోషంగా గడిపెయ్యాలి ఉగాదినెప్పుడూ!" అంది శ్రీమతి.

"ఏం పండగ తేద్దూ—పోనిద్దూ!" అన్నాడు సంజీవయ్య.

"ఇందాకటినుంచి మొత్తుకునేదేమిటి. మీరనేదేమిటీ. రాండి నన్నాట్టే విసిగించక!" అంటూ తుండుగుడ్డ పడేసింది సంజీవయ్యమీద.

సంజీవయ్య లేచాడు. శ్రీమతి సంతోషించింది.

సంజీవయ్య తలంటు పోసుకొని వచ్చి వసారాలో కూర్చున్నాడు. చంటివాణ్ణి వొళ్ళో కూచోబెట్టి పోయింది శ్రీమతి. పెద్దపిల్లవాడు బయట ఆడుకుంటున్నాడు. చంటివాడు ఆప్యాయంగా లేత వేళ్ళతోటి సంజీవయ్య గడ్డం రాస్తున్నాడు. సంజీవయ్యకు వున్నట్టుండి బాధ కలిగింది. తనదేం బ్రతుకు. ఎన్నాళ్ళున్నా గొర్రెతోక జీవితం. ఎందుకూ కొరగాని జీవితం. రేపు పండగగదా. పిల్లవాళ్ళకు కొత్త బట్టలుకూడా కుట్టించలేకపోయాడు, తమ యిద్దరిసంగతి అట్లానే

వున్నా, పాపం, ఎన్నాళ్ళయిందో శ్రీమతికి కొత్త చీర తీసుకొచ్చి. తనకేం ఫర్వాలేదు. కోటుకింద చొక్కా చిరుగు ఎవరికీ అవపడవు. ఆడదానికి మంచిబట్టలు లేకపోతే అంతకన్నా నామోషీ ఏమైనా వుందా? పాపం, పిల్లలకేం తెలుస్తాయి, కొత్తబట్టలు తొడుక్కోవాలని వుబలాటం. కాని తానేం చేయగలడు. అప్పిచ్చే గాడ్దెకొడుకులు కూడా యింకెవరూ అవపడరు. పన్నెండో తారీకు, అందులోను పండగముందు, ఏ స్నేహితుడి దగ్గర వుంటయ్. వుంటే ఎవరిస్తారు? కొత్తబట్టలు అవీ లేకపోతే మానె, కాస్త పండగన్నా చేసుకోవాలనా! కుర్రవెధవలు, అమాయకులు వాళ్ళకేం తెలుసు వాళింట్లో అవి చేసుకున్నారు. అని చెబుతారు. ఎడవాణ్ణి దగ్గరకు పిల్చాడు సంజీవయ్య. బిక్కు బిక్కు మంటూ వచ్చాడు బాబు. జేబు వెతికాడు ఏమన్నా తగులుతుందేమోనని ఏమీ తగలలేదు. "అరే నాన్నా వేపపూత తెస్తావుటరా, రేప్రొద్దున," అడిగాడు సంజీవయ్య.

"ఇప్పుడే తెస్తా నాన్నా. వాళ్ళింట్లో కోస్తున్నారు. బాబు పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు. సంజీవయ్య నిట్టూర్చాడు.

చక్కగా ముఖం కడుక్కొని కన్నులనిండా కాటుక పెట్టుకొని కళకళ లాడుతూ వచ్చింది శ్రీమతి. చంటివాణ్ణి వొళ్ళో వేసుకుని అక్కణ్ణే కూలబడ్డది. సంజీవయ్య చూశాడు. మంచివి రెండు చీరలన్నా లేవు. తనతోటి అంత సుఖపడుతున్నది పాపం. సంజీవయ్యకు కళ్ళనీళ్ళొచ్చినయ్. సంక్రాంతి పండుగకు వాళ్ళన్నయ్య చీర కొనుక్కొచ్చి యిచ్చిపోతే, పండక్కొసం వారు తెచ్చారు, అని పక్కింటావిడతోటి చెప్పటం సంజీవయ్య విన్నాడు ఇదివరకు.

"కంట్లోకి నలుగు పోయిందా, ఏమిటండీ?" శ్రీమతి అడిగింది. "ఏదో పోయినట్లుంది." అన్నాడు సంజీవయ్య.

"రేపు ఏంచెయ్యమంటారు?" అడిగింది శ్రీమతి.

బాబు వేపమండలు నాలుగు తీసుకొనివచ్చి అక్కడ పడేసి "లడ్డూలే అమ్మా" అన్నాడు.

సంజీవయ్యకు బాధ కలిగింది.

"ఏమిటండీ ఎప్పుడూ ఆలోచనే మీకు" అంది శ్రీమతి.

"దరిద్రం అష్టకష్టాల్లో వొకటి. పంచతంత్రంలో చిన్నయ సూరిగారు వ్రాశారు." అన్నాడు సంజీవయ్య.

"ఛా ఛా. మనకేం యిప్పుడు దరిద్రమూ లేదు. అష్టకష్టాలూ లేవు" అంది శ్రీమతి. "రేపు నా బాబు కలక్టరవుతాడు" చంటివాణ్ణి ముద్దుపెట్టుకుంటూ అంది శ్రీమతి.

"మా అమ్మకూడా అలానే అనుకునివుంటుంది" అన్నాడు సంజీవయ్య.

"కాని నా బాబు తప్పక కలక్టరవుతాడు" అంది శ్రీమతి.

"శ్రీమతీ చూడూ...నీకు ఒక్క చీరకూడా తేలేకపోయాను." అన్నాడు సంజీవయ్య.

"సరేలేండి నా సంగతే ఇప్పుడు ముందు. మీ గుడ్డలన్నీ చిరిగిపోయాయి. ఎన్ని రోజులనుంచీ చెబుతున్నాను రెండు పంచెలు కొనుక్కోండని. ఎప్పుడూ వున్నదేగా. ఈసారి జీతం రాగానే తప్పక కొనుక్కోండి. ఎలానోలా వీలుచూసుకుని" అంది శ్రీమతి.

సంజీవయ్య నవ్వుకున్నాడు.

"ప్రొద్దుటే వెళ్ళి, అన్నీ తీసుకరాండి. మధ్యాహ్నంపూట లడ్డూలు కడతాను" అంది శ్రీమతి.

'అదే ఆలోచిస్తున్నాను' అన్నాడు సంజీవయ్య

శ్రీమతి లోపలకు వెళ్ళి పాలడబ్బా వొకటి పుచ్చుకొచ్చింది.

"ఇదిగో గరిటె పెట్టి చిల్లికాస్త పెద్దది చేసి, కార్చండి డబ్బులు కారతయి" అంది శ్రీమతి.

సంజీవయ్య తీసుకుని కార్చాడు. ఏడ్చేడ్చి బాబు తీసుకున్న కాన్లూ, అర్ధణాలు, శ్రీమతి పూలు కొనుక్కుంటానని తీసుకున్న అణాలు, బేడలు, అన్నీ కారినయ్. సంజీవయ్యకు సర్వ ప్రపంచం ఆనందమయంగా తో చిం ది. తన ముందున్న కళాధి దేవతగా తలచుకున్నాడు శ్రీమతిని. లెక్కపెట్టాడు సంజీవయ్య. ఐదురూపాయల ముప్పావలా అర్ధణా వుంది. సంజీవయ్య మరి మాట్లాడలేక పోయాడు. శ్రీమతివైపు చూశాడు. శ్రీమతి ముఖంలో చిరునవ్వు మెరిసింది. సంజీవయ్య శ్రీమతిని వొక్క ముద్దు పెట్టుకున్నాడు. అంతే— సంజీవయ్య సంబరం అవధులు దాటింది. ★